# సుశీల కథలు

## జీవియస్

# మూడు ముడుల ముచ్చట

“యెనక జల్మంలోన-యెవరమో నంటి,
సిగ్గొచ్చి నవ్వింది-సిలక నాయెంకి!
ముందు మన కేజల్మ-ముందోలె యంటి,
తెల్లతెలబోయింది-పిల్ల నాయెంకి!
ఎన్నాళ్ల మనకోలె-ఈసుకము అంటి
కంట నీరెట్టింది-జంట నా యెంకి!''

రేడియోలో పాట వినిపిస్తోంది. కుర్చీలో కళ్ల మూసుకుని తన్మయత్వంతో కూర్చొనివుంది మా పెద్దొదిన. ఆమె కనుకొలకుల్లో రెండు కన్నీటి ముత్యాలు మిలామిలా మెరుస్తున్నాయి. ముందు పలకరించటానికి జంకినా నేను ధైర్యం చేశాను.

''వొదినా! మీ తమ్ముడితో కలిసి టిఫిన్ చేద్దువుగాని లే'అని పిలిచాను. ఆమె సమాధిలో నుంచి లేచినట్లు కళ్ల తెరిచింది. రమణ మహర్షిలా ఒక నవ్వు నవ్వింది. కన్ను లొత్తుకున్నది.

''ఆ మూడు ముళ్ళ పాట విన్నావా?'' వొదిన నన్నడిగింది.

''అవన్నీ నాయుడు బావ చతుర్లు''నా వంకర నవ్వు సమాధానం.

''పిచ్చ మొగమా! అవి పైకి చతుర్లేకావచ్చు, లోపల గమనిస్తే మూడు జన్మలు ముడిబడ్డ ముచ్చట్లు.''

''మాటకారి మొగుళ్ల ముందు పెళ్లాలు సిగ్గుపోవటమే సింగారం కాబోలు..ఆ యెంకి వాలకం అలాగే వుంది.''

''ఆమాటకొస్తే నీవు కూడా ఒక యెంకివే''వొదిన ఛలోక్తి.

.''యెంకి కంటె అదృష్టవంతురాలిని నేను; ఆమెకు నాకులాగా ఒక పెద్దొదిన లేదు''కళ్లెగరేస్తూ మా వొదినను నవ్వించాను.

''నీవూ మాటకారి వౌతున్నావే మరదలా!''

పెద్దొదిన లేచొచ్చింది వంటింట్లోకి. ముగ్గురం పీటల మీద కూర్చున్నాం. ఉప్మా పొదివిన పెసరట్లు ప్లేట్లల్లో పెట్టాను. మావారి కళ్లు మెరిశాయి. మా యిద్దరి మధ్యా టిఫిన్‌కోడ్ భాష ఒకటి ఉంది. ఉప్మా పెసరట్ చేస్తే ఆరోజు నామనసు గుత్తివంకాయ కూర పాట పాడుతున్నదన్నమాట! గారెలు చేస్తే ఇద్దరూ కలిసి కులాసాగా తిరగాలని ఉందని చెప్పినట్లన్నమాట! అలాగే-తోటకూర బజ్జీలు చేసినరోజు నా మనసేమీ బాగోలేదన్నమాట. ఆయన టిఫిన్ పూర్తిగా తింటే నాతో పూర్తిగా ఏకీభవిస్తున్నారన్నమాట. సగం తింటే తన కిష్టం లేదనీ నా కిష్టమైతే తన కభ్యంతరం లేదనీ అర్థమన్నమాట. టిఫిన్ వద్దని వదిలేస్తే ఆయనకు కోపం వచ్చిందన్నమాట! ఈ రహస్య భాషను నేను మావొదినకు చెప్పలా. ఎందుకంటే- అన్నీ అందరికీ చెప్పేస్తే అలుసై పోతామని.

నేను బిక్కుబిక్కుమంటూనే మావారిముందు టిఫిన్ ప్లేట్ పెట్టాను. ఆయన ఒకక్షణం ముట్టలేదు. నాపరువెక్కడపోతుందో అని గుండె దడదడా కొట్టుకొంటోంది.

''వొదినా!కానీ'' అన్నాను చనువుగా. అన్నది ఒదినతోనైనా నా మనసులో ఉన్నది మావారే. ఆయన అలాగే అంటకుండా కూర్చున్నారు.

''చిన్నవాళ్లు తినందే పెద్దవాళ్లు తినటం ఆనవాయితీ కాదు'' అన్నది వొదిన మావారిని వొడిసి రాయితో కొట్టినట్లు.

మావారిలో చైతన్యం వచ్చింది. టిఫిన్ మొదలు పెట్టారు. హుషారుగానే లాగేస్తున్నారు. రుచిమరిగిన



నాల్కకు రోషముండదంటారు అందుకే కాబోలు.

''ఉద్యోగంలో ఎప్పుడు చేరదామనుకుంటున్నావురా తమ్ముడూ!'' మావొదిన తీగ కదిలించింది. ఆయన యోగిలా పోజుపెట్టి మొదలుపెట్టారు-

''అసలు చేరాలా? వద్దా? అన్నది మొదటి ప్రశ్న; ఎందుకు చేరాలన్నది రెండో ప్రశ్న; అన్నీ అనుకూలిస్తే ఎప్పుడు ఎలా చేరాలన్నది మూడో ప్రశ్న'' మావారు ప్రశ్నోపనిషత్తును పఠిస్తున్నారు.

''తనంతట తాను వలచివచ్చిందని ఉద్యోగాన్ని చులకనగా చూడబోకు''మావొదిన చేస్తున్న మొదటి హెచ్చరిక. నాకు మనుచరిత్ర జ్ఞాపకం వచ్చింది.

''ఉద్యోగం మీద నాకేమీ కోపం లేదు: ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని సేవించట మంటే నా పెంచిన తల్లిని పూజించటం వంటిది. అది నా అదృష్టం''

''మరి ఈ మీనమేషాలు లెక్కపెట్టటం దేనికి?''

''అక్కయ్యా! ఉపాధ్యాయవృత్తి ఉన్నతమైనదే, కాని, నా ప్రవృత్తి యిప్పుడు దానికి పూర్తిగా అనుకూలంగా లేదు. నాటకాలు రాయడం, వేదికలపై అభినయించటం, కథలు, నవలలు రాయడం, పత్రికలు నడపడం, కవిత అల్లడం- ఇవన్నీ నాకిష్టమైన కళలు. నేను రచయితను కావాలని ఉంది. ఉపాధ్యాయుణ్ణైతే నాలోని కళలన్నీ వికసించే అవకాశం అంతగా ఉండదేమో! చివరకు నాబాట, నామాట రెండూ మారిపోవచ్చు. అందువలన 'ఇదా-అదా' అనే సంఘర్షణలో సతమత మౌతున్నాను.

''నీకు పదిరంగాల్లో ప్రతిభ ఉండచ్చు. కాని, అన్నిట్లో ఒకేరకంగా రాణించటం సాధ్యం కాదు సామాన్యంగా. నీలో కళ ఉంది. అది జ్యోతి లాంటిది. అది బాగా ప్రకాశించాలంటే జ్ఞానతైలం కావాలి. దాన్ని ఉపాధ్యాయవృతి సమకూరుస్తుంది. ప్రతినిత్యం నిన్ను పదును పెట్టేది నీవృత్తి; ఆపదునులో కొత్త ప్రయోగాలు చేసేది నీ ప్రవృత్తి. ఆరెండూ పోషకాలే కాని, విరుద్ధాలుకావు'' మా పెద్దొదిన మాటలకు మావారు ఒకక్షణం ఆగి ఆలోచించారు.

''నీ మరద లేమంటోంది?'' అని వాళ్లక్కయ్య నడిగారు మావారు.

సూటిగా నన్నే అడగనందుకు కోపం వచ్చినా, నా మనసు తెలుసుకుందామని కోరికపడుతున్నందుకు సంతోషం కూడా కలిగింది. అయినా కేరాఫ్ ప్రశ్నకు డైరెక్టు సమాధానం ఎందుకు చెప్పాలని బింకంగా ఊరుకున్నాను.

''మరదలు పిల్లా! నీ మనసేమిటే?'' వొదిన పలకరింపు.

''నవలలు రాయడానికి నానా అవస్థలు పడిందానికంటె, నాటకాల కోసం నలుగురికాళ్లూ పట్టుకున్నదానికంటె, లెక్చరర్ ఉద్యోగం అన్ని విధాలా గౌరవప్రద మనుకుంటాను...కళ ఉన్నవారు ఏరంగంలో ప్రవేశించినా కళకళలాడుతూనే ఉంటారు'' ఆయనను ఓరగంటితో చూస్తూనే వొదినకు సమాధానం చెప్పాను.

''ప్రైవేటు ఉద్యోగాల కంటె యూనివర్సిటీ ఉద్యోగం భద్రం కూడా'' మా వొదిన నావాదాన్నే సమర్థించింది.

మావారు టిఫిన్ ముగించి చేతులు కడుక్కుంటున్నారు...

''ఉద్యోగం మనిషి బతకటానికేనా? వికసించటానికి కూడానా?'' అన్నది నా ప్రశ్న...బ్రతికితే ఇద్దరం బ్రతుకుతాం; వికసిస్తే ఇద్దరం వికసిస్తాం...ఇందుకు నీ మరద లిష్టపడుతుందా? అక్కయ్యా!''

''నేను తడిక రాయబారిని కాను..మీ సంగతి మీరే ముఖాముఖీ తేల్చుకోండి...''మావొదిన తన మర్యాద తాను నిలుపుకుంది.

మావారు తెల్లబోయారు: వెంటనే తేరుకున్నారు; ఒక నవ్వు నవ్వారు.

''మేమే తేల్చుకుంటాం...అదృష్టవశాత్తూ నీవున్నావు..అమ్మకూ నాన్నకూ, మనవాళ్ళందరికీ ప్రతినిధివి...అందుకు నిన్నడుగుతున్నాను.''

మావొదిన చెమ్మగిల్లిన కన్నులతో చిరునువ్వు నవ్వింది. ఆయన పనిమీద వెళ్లబోతున్నారు.

''అక్కయ్యా! మేం కాపురం పెట్టిన తరువాత ఇంటి పెద్దాడబడుచువు వచ్చావు...అది మాకు శుభం...నీవు మూడు రోజులుండాలి...మాకు ముచ్చట కలిగించాలి'' అన్నారాయన.

'' మీతమ్ముడు ఉద్యోగానికి బయలుదేరుతుంటే శుభశకునంగా ముందు రావాలి'' నేను కూనిరాగం తీశాను.

ఆయన మెరుపులా నావైపు చూచారు.

''నేను వెళ్తుంటే నా వెంట సుశీల కూడా వస్తుంది. నేను ఒంటరిగా పోను; తనను ఒంటరిగా వదలను''

ఒరలో నుండి లాగిన కత్తిలాగా దూసుకుంటూ బైటికిపోయారు.

★ ★ ★

మధ్యాహ్నం భోజనాలయిం తర్వాత కూడా మావారు బింకంగానే వున్నారు. ఆయనలో అంత సంఘర్షణ సాగుతోంది. తలా ఒక చాప వేసుకొని కూర్చున్నాం. మా వొదిన నడుం వాల్చింది. ఆమె పక్కనే చేరి నేనుకూర్చున్నా. మావారు గోడకు జాగిలపడి కాళ్లు చాచుకొని కూర్చున్నారు.

''వరంగల్‌లో నేనొక్కణ్ణే ఉద్యోగం చేయడమా? హైదరాబాదులో మనమిద్దరమూ ఉద్యోగాలు చేయడమా?'' అని ఆలోచిస్తున్నాను.'' అన్నారు మావారు.

నాకాళ్లకింద డైనమేట్ పెట్టినట్లుంది ఆప్రశ్న.

''నేను ఉద్యోగం చేయడమా...? బాబోయ్...నాకివన్నీ పెట్టబోకండి'' నేను కేకవేసినట్లు మాట్లాడాను.

''సిటీలో బ్రతకాలంటే మనిద్దరమూ వేణ్ణీళ్లకు చన్నీళ్లుగా సంపాదించుకోవాలసిందే.''

''చేతికందిన ఉద్యోగాన్ని కాదని ఊహాగానాలు చేస్తారేమిటి?''

''సూటిగా అడుగుతున్నాను చెప్పు: నీవు ఉద్యోగం చేస్తావా? చేయవా?''

''ప్రస్తుతం చెయ్యను. నేను ఇల్లు చూచుకుంటాను...మీరు ఉద్యోగం చేసి సంపాదించండి...మీ సంపాదనను పొదుపుగా వాడతాను. మీకు అండదండగా ఉంటాను..మనకు పిల్లలు కలిగితే వాళ్లను పెంచుతాను...అలాకాక, నేనూ ఉద్యోగం చేస్తే ఇల్లంతా ఎవరు చక్కదిద్దుతారు?''


''ఇద్దరం కలిసి ఇల్లు చక్కదిద్దుకుందాం.''

''మగాళ్లు ముందు ఇలాగే అంటారు..తీరా అవసరం వచ్చినప్పుడు చప్పుడు చెయ్యకుండా జారుకుంటారు. అప్పుడు ఇంటా బైటా సంబాళించుకోవలసింది ఆడదే అవుతుంది...ఏమంటావువొదినా?''అని మా వొదిన సపోర్టుకోసం అడిగాను.

''ఇంట్లో ఆడామగా ఉంటారు కాని, ఇంటిని ఆడామగా అని చీల్చలేం. బైట ఆడామగా తేడా ఉన్నా, ఇంట్లో ఇద్దరూ ఒకరికొకరు సర్దుకోక తప్పదు'' మావొదిన సమీక్ష.

''వొదినా! నీ మాటల వలన పాము చావడం లేదు; కర్ర విరగడం లేదు''- కొంచెం కొంటెగా అన్నాను.

''పిల్లా! నీకలాగే



అనిపిస్తుంది. మావాడికి బైటపని వచ్చు; ఇంటి పని వచ్చు. మన కుటుంబాలలో ప్రతి మగవాడికీ చెయి కాల్చుకోవటంలో అంతో ఇంతో తరిఫీదు ఉండనే ఉంటుంది...మన కుటుంబాల అవసరాలు అటువంటివి. మావాడికి వంట వచ్చు; ఒక్కోసారి నీకంటె రుచిగా కూడా చేయగలడు; మిగిలిన ఇంటి పనులు కూడా వాడూ చేయగలడు. అయితే నీ ఆడదేహం చేసే పనులు వాడు చేయలేడు''అని నవ్వింది మావొదిన.

''మొగదేహం చేసే పనులను వదలిపెడితే, స్త్రీలూ మగవాళ్లు చేసే పనులు చేయగల రనుకొంటా నొదినా?''

''నీవన్నది నిజం నిజం''

''అయితే, ఆడది ఉద్యోగం చేస్తుంటుందనుకో, ఆమెకు ఆడ సమస్యలుండవా?''

''ఉంటాయి. కొన్నిదేహ సమస్యలు; కొన్ని మానసిక సమస్యలు.''


''నేను ఉద్యోగం చేసినా అవి తప్పవుగా?''


''నీవు సాక్షాత్తూ దేవతవైనా కొన్ని తప్పవు''

''బాబోయ్..నేనిప్పుడు ఆ సమస్యలను కావాలని కొని తెచ్చుకోలేను..నన్ను సమస్యల ఊబిలో దింపదలచుకున్నారో..లేదా తాము మర్యాదగా ఉద్యోగం చేయదలచుకున్నారో?...తేల్చి చెప్పమని అడుగొదినా!'' మావారిని చూస్తూనే వొదినతో ఖండితంగా మాట్లాడాను.

వొదిన ఏమీ మాట్లాడలేదు..ఒక్క క్షణం నిశ్శబ్దం.

మధ్యాహ్నం భోజనాలయిం తర్వాత కూడా మావారు బింకంగానే వున్నారు. ఆయనలో అంత సంఘర్షణ సాగుతోంది. తలా ఒక చాప వేసుకొని కూర్చున్నాం. మా వొదిన నడుం వాల్చింది. ఆమె పక్కనే చేరి నేనుకూర్చున్నా. మావారు గోడకు జాగిలపడి కాళ్లు చాచుకొని కూర్చున్నారు.




''ఇల్లాలిని సంతోషపెట్టటానికి నాలోని కళను, రచయితను మరుగున పెట్టుకుంటున్నాను...ఉద్యోగానికి అంకితమౌతున్నాను...ఈ సత్యానికి మా అక్కయ్య సాక్షి.''

నాకోసమే తమత్రోవ మార్చుకుంటున్నట్లు, నా కోసమే తమ కళాజగత్తును త్యాగం చేస్తున్నట్లు మాట్లాడుతుంటే నాకేదో సినిమాలో సీను చూస్తున్నట్లనిపించింది. కాని మావారి మాటల్లో, చేష్టల్లో తెచ్చిపెట్టుకున్న లక్షణం కనపడటం లేదు. అందువలన ఆయన నిజంగా నన్ను కలుపుకొని పోవటానికే తమ అభిరుచులను, ఆశయాలను కూడా మార్చుకుంటున్నారేమో!

ఏమైనా వారిలో వచ్చిన మార్పు నాకొక తృప్తితో పాటు ఒక గర్వాన్ని కూడా కలిగిస్తోంది. ఆయనను నేనే సరైన బాటకు తేవటంలో విజయం సాధించానేమో అని నా అంతరాత్మ పలుకుతోంది.

చూడ- ఆయన చిక్కాడు, నేను దొరకను లాగా ఉంది ఆక్షణం!

''మరదలు పిల్లా! ఉద్యోగం మావాడి అదృష్టం అన్నాను నిన్న...కాని..అది నిజంగా నీ అదృష్టమేనని ఈరోజంటున్నాను'' మావొదిన పున్నాగపువ్వుల్లాగా నవ్వులొలకపోసింది.

★ ★ ★

మావొదిన మేం పెట్టిన చీర కట్టుకుంది. మమ్మల్నిద్దర్నీ ఆశీర్వదించింది. మేమిద్దరం కలిసి నవ్వుతున్న కళను చూచి తానొచ్చిన పని సఫలమైందని సంతృప్తి పడుతున్నట్లు కనిపించింది. రేపే మావారి ఉద్యోగ ప్రస్థానం. మావొదినను పెద్దబావగారింట్లో దించినట్లుంటుంది. గురుదేవుల ఆశీస్సులు పొందినట్లుంటుందని దోమలగూడకు బయలుదేరాం.

ఆశ్రమంలో శ్రీ గురుదేవులను దర్శించుకున్నాం. మావారిని పట్టుబట్టలు కట్టుకొని రమ్మన్నారు. ఒంటరిగా ఒక గదిలోకి పిలిచారు. మూడు బీజాక్షరాల దత్తాత్రేయ మంత్రాన్ని మావారికి ఉపదేశించారు. శ్రీగురుచరణాలపై పూలు పండ్లనుంచి వారు నమస్కరించారు; నేనూ శ్రీ చరణాలను కళ్లకద్దుకున్నాను. గురువులు ముద్దులు మూటకట్టే దత్తాత్రేయస్వామి చిన్ని వెండి విగ్రహాన్ని నిత్యపూజలో ఉంచుకోండని మా యిద్దరి చేతుల్లో ఉంచారు. ఏదో చెప్పలేని ఆనందం!

శ్రీ గురుదేవులు దివ్య సందేశాన్ని మా కిస్తున్నారు....

''మీ జీవితంలో ఎప్పుడూ ''మూడు' అనే సంఖ్య ముడిపడే ఉంటుంది. దానికి ఆధ్యాత్మిక ప్రతీక దత్తాత్రేయస్వామి. మూడుముళ్ల మీ వివాహబంధం మూడు జన్మల అనుబంధం! మీ దంపతులు సంగీత సాహిత్యోపాసకులు. అమ్మాయి సంగీతం నేర్చుకుంది. సంగీతంలోలాగా సంసారంలో కూడా భావం, రాగం, తాళం సాధనలో నిలవాలి. లయ తప్పకుండ సాగాలి. ఇల్లాలుగా సంసార బాధ్యతలతోపాటు సామాజిక బాధ్యతలూ, సాంస్కృతిక బాధ్యతలూ నిర్వహించాలి. ఆ మూడింటిని సమన్వయించి సాధించడమే స్త్రీ జీవితంలో దత్తాత్రేయోపాసనం.''

''నీవు సాహిత్యోపాసకుడివి. నీకు కళాదర్శనం ముఖ్యం. అది భౌతికంతో ఆధ్యాత్మికంతో అన్వయించాలి. అందుకు తోడ్పడే మూడు శక్తులు సత్యం, శివం, సుందరం. నీవు సమాజంలో సత్యాన్ని దర్శించు; సంప్రదాయంతో శివాన్ని సాధించు; కళా ప్రయోగంతో సౌందర్యాన్ని ఆవిష్కరించు. బ్రహ్మ విష్ణు శివశక్తులే జీవిత రంగంలో వివిధ రూపాలతో ప్రత్యక్షమౌతూ ఉంటాయి. వాటి మధ్య సంఘర్షణ సృష్టిస్తే అశాంతి; సమన్వయం సాధిస్తే ప్రశాంతి. దత్తాత్రేయ భావన శక్తి త్రయాద్వైత భావన!'' గురువుల ఉపదేశామృతం ఉజ్జ్వలంగా సాగుతోంది.

''స్వామీ! కుటుంబంలో ఈ త్రిమూర్తితత్త్వాన్ని ఎలా దర్శించాలి?'' మావారి ధర్మ సందేహం.

గురువుగారు చిరునవ్వు నవ్వారు. మందార మకరంద బిందువుల్లా మరికొన్ని మాటలు పలికారు.

''నాలుక మీద భార్యను నిల్పినవాడు బ్రహ్మ! ఇంటి యిల్లాలితో సత్యమే మాట్లాడమంటాడు బ్రహ్మ. అదే సత్యం. గుండెమీద శ్రీవత్సలాంఛనంగా లక్ష్మిని నిలుపుకున్నాడు విష్ణువు; మనసులో మగువకు గౌరవప్రదమైన చోటివ్వమంటాడు విష్ణువు; అది దాంపత్యానికి శివంకరమైన వరం. నీలో ఆమె ఎప్పుడూ సగమని తెలుసుకోమంటాడు అర్ధనారీశ్వరుడు శివుడు. నీకు సుఖం కలిగించేదే ఆమెకు సుఖ ప్రదమౌతుందనీ, నీకు కష్టమనిపించింది ఆమెకూ కష్టమౌతుందనీ అద్వైత భావనం చేయటం సంసార జీవన సౌందర్యం. ఈమూడింటినీ ముడివేయటమే వివాహ జీవిత పరమార్థం.''


''స్వామీ! నేనెలా నడచుకోవాలో నిర్దేశించండి''నేనూ సవినయంగా మనవి చేసుకున్నాను.

గురువుగారు ప్రసన్నంగా నావైపు చూచి చిరునవ్వుతో ఇలా అన్నారు-''సంసారంలో నీ అనుభవం సత్యం; దాన్ని మీవారితో బిడ్డలతో బంధువులతో పంచుకోవడం శివం; మీ కుటుంబం లాంటిదే విశ్వకుటుంబమని భావించి విశ్వశ్రేయస్సుకు యథాశక్తి కృషి చేయటం సౌందర్యం. ఇల్లాలు ఇంటికి కేంద్రం. ఆమె భూమ్యాకర్షణ శక్తి లాంటిది. ఆ ఆకర్షణ శక్తి సంసార పరిధి దాటి ఆవలకు చేరుకుంటే ఇల్లు కూలిపోతుంది...ఈ వాస్తవం జీవితంలో మరచిపోకు.''

గురువులు సింహాసనం మీద నుంచి లేచారు. ఇరువురమూ శ్రీపాదాలకు నమస్కరించాం...మాజీవిత ప్రస్థానాలకు ప్రస్తావన నిర్వహించిన ఒక మహాసూత్రధారునిగా ఆశ్రమంలోకి నిష్క్రమించారు.

జీవితమంతా మూడు ముడుల ముచ్చటలాగా తోచింది.

★



## ఊర్మిళ ధీమా!

ఏడాది క్రితం వచ్చిన 'రంగీలా' సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదనే సంగతి అందరికీ తెలుసు. అయితే ఇంతగా హిట్టయిన చిత్రంలో నటించిన ఊర్మిళ నటించిన మరో హిందీ చిత్రం ఇంతవరకూ విడుదల కాకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించకమానదు. కానీ ఊర్మిళ మాత్రం పెద్దగా హైరానా పడకుండా 'ఏం హిందుస్తానీ సినిమా (భారతీయుడు) హిట్ అయింది కదా' అని గొప్పగా అంటోంది. ఊర్మిళకి మాత్రం ఏమంత భయంగా వున్నట్టు లేదు. ఎంతో ధీమాగా కనిపిస్తోంది.

-బీవీజె